క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీలు



దేవుదళ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని దేవుదళ, లక్ష్మీపురం, సంకిలి, తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తెరిచే సమయం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, బోధన, టీఎల్ఎం వినియోగాలపై ఆరా తీశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షించారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, సీఆర్ఎంటీ కెంబూరు చంద్రరావు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు..



సంకిలిలో కుళాయిల ద్వారా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న జేఈ శ్రీచరణ్, తదితరులు

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ అన్నారు. మండలంలో సంకిలి, బొడ్డవలస, ఉంగరాడ గ్రామాల్లో శనివారం పర్యటించి జల్‌జీవన్ మిషన్ తాగునీటి పైపులైన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ, కుళాయిలు పాడైతే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సంకిలి పంచాయతీ సర్పంచ్ బుడుమూరు పట్టాభి, తదితరులు ఉన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

తెర్లాం: పశువులకు వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఉద్దవోలు పశువైద్య కేంద్రం వద్ద పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు ఆయనతో పాటు సచివాలయ గ్రామ పశు సంవర్ధక సహాయకులు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు.

బాల్య వివాహాల నుంచి విముక్తి కల్పిద్దాం..



పారాది హైస్కూల్ వద్ద నినాదాలు చేస్తున్న కార్యకర్తలు, ఉపాధ్యాయులు

బొబ్బిలి రూరల్: ఆడ పిల్లలకు బాల్య వివాహాల నుంచి విముక్తి కల్పిద్దామని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మండలంలోని అలజంగి, పక్కి, పిరిడి, పారాది గ్రామాల్లోని హైస్కూల్ విద్యార్థులతో కలిసి శనివారం ర్యాలీలు నిర్వహించారు. ఆడ పిల్లలను స్వేచ్ఛగా ఎదగనివ్వాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కార్యకర్తలు, ఆయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థిలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి స్పందన

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన చిరు వ్యాపారి వారణాశి జగన్నాథ స్వామి నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తాను నిర్మించిన శ్రీరామధర్మక్షేత్రంలో ఏడేళ్లుగా వావిలవలసతో పాటు పరిసర గ్రామాల అనాథలు, సాధువులకు ప్రతి రోజు మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. శనివారం కూడా పదుల సంఖ్యలో సాధువులు, అనాథలు వచ్చి భోజనం చేశారు.

దివ్యాంగ డ్యాన్సర్‌కు ఆర్థిక సాయం

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన దివ్యాంగ డ్యాన్సర్ బంగారు భుజంగరావుకు దాతలు ఆర్థికసాయం అందించారు. ఇటీవల బెజ్జిపురంలో జరిగిన శివరాత్రి ఉత్సవాల ఈవెంట్‌లో భుజంగరావు తన అద్భుత డ్యాన్స్‌తో ఆహూతులను అలరించారు. ఈ మేరకు రణస్థలంనకు చెందిన రాయల్‌మీచ్ రమణ అనే యూట్యూబర్ రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని భుజంగరావుకు శనివారం అందించారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్..

- కనీస వసతులు కరువైన రామభద్రపురం అంతర్రాష్ట్ర కూడలి బస్టాండ్
- తాగునీరు సౌకర్యం కల్పించని అధికారులు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

రామభద్రపురం: ఆర్టీసీ బస్టాండ్‌లు నానాటికీ అధ్వానంగా మారుతున్నాయి. ఇష్టానుసారంగా చార్జీలు పెంచి ప్రయాణికులపై భారం మోపుతున్న ఆర్టీసీ యాజమాన్యం బస్టాండ్‌లలో వసతులు కల్పించడంపై మాత్రం దృష్టి సారించడం లేదు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్టాండ్‌లలో కనీసం తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు కూడా కరువయ్యాయి. కేవలం డిపోలు ఉన్న బస్టాండ్‌లలో మాత్రమే వసతులు ఉన్నాయి తప్ప మిగతా చోట్ల ఎక్కడా కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. రామభద్రపురం అంతర్రాష్ట్ర కూడలిలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ మరీ అధ్వానంగా మారింది. బస్టాండ్ ఆవరణలో ఇష్టానుసరంగా ఆటోలు నిలబెట్టడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలిగినా సంబధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ ప్రాంగణం గుంతలమయంగా ఉండడంతో వర్షాలకు ఆ ప్రాంతమంతా చిన్నపాటి చెరువును తలపిస్తోంది.



ఆర్టీసీ బస్టాండ్‌లోనే నిలిచి ఉన్న ఆటోలు

నిత్యం రద్దీ..

అంతర్రాష్ట్ర కూడలి కావడంతో రామభద్రపురం బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటోంది. విజయనగరం ఉమ్మడి జిల్లాతో పాటు విశాఖపట్టణం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విజయవాడ, గుంటూరు, తదితర జిల్లాలకు ఇక్కడ నుంచి బస్సు సౌకర్యం ఉంది. అలాగే ఒడిశా, హైదరాబాద్ రాష్ట్రాల బస్సులు కూడా మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్డినరీ నుంచి ఇంద్ర, గరుడ వంటి ఆర్టీసీ బస్సులు తిరుగుతుండడంతో ఈ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కళకళలాడుతోంది. అయితే బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో ముఖ్యంగా మహిళా ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

అసలే ఇరుకు రోడ్డు..అక్కడే దుకాణాలు..

ఆర్టీసీ బస్సులు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ బస్టాండ్‌లోకి రావాలంటే డ్రైవర్లు నానా ఇబ్బంది పడుతున్నారు. బస్సులు లోపలకు వచ్చే రోడ్డు ఇరుకుగా ఉన్నా సంబధిత అధికారులు పట్టించుకోకుండా ఆవరణలో దుకాణాలు నిర్మించి అద్దెకు ఇచ్చేశారు. దీంతో బస్సులు లోపలకు రావడానికి చాలా ఇబ్బందులేర్పడుతున్నాయి.

అభివృద్ధికి ప్రతిపాదనలు..

రామభద్రపురం ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశాం.మరుగుదొడ్లు ఆధునీకరణ చేయడంతో పాటు రోడ్డు గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. వేసవిలో తాగునీరు ఏర్పాటు చేస్తాం. అలాగే బస్టాండ్ ఆవరణలో ఆటోలు లేకుండా చేసేందుకు పోలీసులకు ఫిర్యాదు చేశాం. అయినా ఆటో డ్రైవర్లు వినడం లేదు. మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– ఆదినారాయణ, అసిస్టెంట్ డిపో మేనేజర్, విజయనగరం



బస్టాండ్ ప్రాంగణంలో నిర్మించి అద్దెకు ఇచ్చిన దుకాణాలు

మొక్కలతో మానవ మనుగడ

- బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు

తెర్లాం: మొక్కలు మానవ మనుగడకు ఎంతగానో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెర్లాం హైస్కూల్ ఆవరణలో గల ఐదో అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ మొక్కలు నాటితే మానవాళికి అవసరమైన ప్రాణవాయువు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెర్లాం ఎస్సై సాగర్‌బాబు, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



అలయ పునఃప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పాలవలస, తదితరులు

వంగర: ప్రజలు ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిధి గీతనాపల్లిలో శ్రీరామాలయ పునఃప్రారంభం, ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం సుదర్శనరావు, నెయిగాపుల శివరామకృష్ణయ్య, నెయిగాపుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బొబ్బిలి రూరల్: మండలంలోని ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపడుతున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో పాడైన బోరు బావులకు క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటివరకు 10 గ్రామాల్లో 30 బోర్లకు మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకువచ్చామని చెప్పారు.

మామిడి కాయలకు కవర్లు తొడగాలి

- ఉద్యానవన శాఖాధికారి మోహన్‌కృష్ణ




మామిడి కాయలకు కవర్లు కట్టడంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి మోహన్‌కృష్ణ

తెర్లాం: మామిడి పిందెలు, కాయలకు కవర్లు తొడగడం వల్ల కాయల సైజ్ పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని ఉద్యానవన శాఖాధికారి మోహన్‌కృష్ణ అన్నారు. మండలంలోని కాగాం గ్రామంలో జిల్లేల్ల జగన్‌మోహనరావు అనే రైతుకు చెందిన మామిడితోటను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మామిడికాయలకు కవర్లు కట్టించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ..మార్కెట్‌లో ఫ్రూట్ కవర్స్ అందుబాటులో ఉంటాయని, వీటిని కాయలకు తొడగడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం

సాక్షి ఎఫెక్ట్

రాజాం: పట్టణంలోని వస్త్రపురి కాలనీలో బాలాజీనగర్ వద్ద 15వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. బాలాజీనగర్‌లో జనావాసాల మధ్య నీటి నిల్వలు నిలిచిపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ఫిబ్రవరి 2న 'దుర్గంధం.. భరించలేం.' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు స్పందించారు. దీంతో రూ. 5 లక్షల అంచనా వ్యయంతో డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో బాలాజీనగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభమైన డ్రెయిన్ పనులు

మోటార్ వాహన చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

- సీఐ నారాయణరావు

రామభద్రపురం: వాహనదారులు నూతన మోటార్ వాహన చట్టాలను ఉల్లంఘిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సీఐ కె. నారాయణరావు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వి. ప్రసాదరావుతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర సర్వోన్నత నాయస్థానం ఉత్తర్వుల మేరకు జరిమానాలు పెంచడం జరిగిందన్నారు. వాహనచోదకులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న సీఐ కె నారాయణరావు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

రాజాం సిటీ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.నాగయ్య అన్నారు. పాఠశాలలో సంకల్పం పేరుతో పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. పదో తరగతే జీవితానికి పునాది అని, రానున్న పరీక్షలకు అంతా సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బీవీ అచ్యుత్‌కుమార్, పీడీలు బి.శంకరరావు, బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వసతి

- ఎంపీడీఓ శ్రీనివాసరావు



ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: ఉపాధి పనులు వద్ద తాగునీటి సదుపాయంతో పాటు తాటాకులు, కొబ్బరి ఆకులతో వసతి ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారంపాండ్లు, ఫిష్ పాండ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని వెల్లడించారు. ప్రతి పంచాయతీలో ఈ నెల 31 నాటికి పది ఫారంపాండ్లు పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి పంచాయతీలో రెండు క్యాటిల్ షెడ్లు పూర్తి చేయించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద శాతం పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్..



తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాగర్‌బాబు ఆధ్వర్యంలో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు పాల్గొని ఆయుధాల వినియోగం, చట్టాలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, ఈవ్‌టీజింగ్, దొంగతనాలకు దూరంగా ఉండాలని సూచించారు. –తెర్లాం

అందరికీ ఒకేచోట పింఛన్లు..



తాము అధికారంలోకి వస్తే లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు ప్రకటనలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక వారికి నచ్చినట్లు పింఛన్లు ఇస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బొబ్బిలి పట్టణం గొడవీధిలో శనివారం ఉదయం లబ్ధిదారులందరినీ ఒకేచోటుకు పిలిచి పింఛన్లు పంపిణీ చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. – బొబ్బిలి

పరామర్శ..



వంగర మండల పరిధి కోనంగిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బొరోతు రాములు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, పార్టీ నాయకులు వేమిరెడ్డి సూర్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – వంగర

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి..



ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆకాంక్షించారు. మండలంలోని కొండదేవుపల్లిలో నూతనంగా నిర్మించిన కొత్తపోలమ్మ దేవాలయంలో అమ్మవారికి శనివారం ధాన్యపు రాశులతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. – బొబ్బిలి రూరల్

ఉద్యోగాలకు 42 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో సంస్థ, కళాశాల ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి సమీపంలో గల తాంద్ర పాపారాయ పాలిటెక్నికల్ కళాశాలలో ఇసుజు కంపెనీ ప్రతినిధులు శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 42 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సుమారు 200 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా 42 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇసుజు సంస్థ మేనేజర్, హెచ్ఆర్‌లు నరేష్, కుందరాదేవి, మోహనరామ్, అజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కృపారావు, తదితరులు పాల్గొన్నారు.